నేడు కబీర్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవి ఎన్నికలు ఆదివారం స్థానిక కమిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్ శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. మొత్తం ఓట్లు 351 ఉన్నాయని, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పెట్రోల్ బంక్ పక్క వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ బలరాం, డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, ఇస్మాయిల్, జబ్బార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు తైక్వాండో దోహదం



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మోతీనగర్: ఆపదలో ఉన్నవారు తమను తాము రక్షించుకోవడానికి తైక్వాండో దోహదపడుతుందని తైక్వాండో ఇంటర్నేషనల్ రిఫరి సంజయ్ అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్, గాయత్రి నగర్‌లోని మెగా స్కూలులో తైక్వాండో పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్స్ అందించారు. కార్యక్రమంలో కోచ్ అష్రఫ్, పాఠశాల చైర్మన్ రఘువీర్ నాథ్, ప్రిన్సిపాల్ సుచిత్ర పాటిల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



రాజశేఖర్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. రాజశేఖర్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ రెడ్డిని కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు, ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్వరరావును సైబరాబాద్ సిటీసీకి బదిలీ చేస్తూ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.

పాపిరెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడిగా చంద్రారెడ్డి



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో నిర్వహించిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఊట్ల చంద్రారెడ్డి విజయం సాధించారు. 5వ సారి ఘన విజయం సాధించారు. తనపై నమ్మకంతో గెలిపించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

10న చలో ఇందిరాపార్కు

నిజాంపేట్: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 10న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని నాయకులు కోరారు. శనివారం ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో కరపత్రం ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందన్నారు. బడ్జెట్‌లో కార్మిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, బాలపీరు పాల్గొన్నారు.





చెరువు కట్టపై ఇరువైపుల పార్కింగ్ చేసిన వాహనాలు

పార్కింగ్‌కు అడ్డా.. చెరువు కట్ట

హస్మత్‌పేట బోయిన్‌చెరువు కట్ట వాహనదారుల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. అక్రమ పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సాయంత్రం వేళ వాహనాల వద్ద మద్యం తాగి ఆకతాయిలు గొడవ పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో అటు నుంచి వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఏదో అలా జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత
- వాహనాల చాటున గంజాయి విక్రయాలు
- మత్తులో దాడులకు దిగుతున్న ఆకతాయిలు
- పోలీసుల పెట్రోలింగ్ అంతంతే

ఓల్డ్ బోయిన్‌పల్లి: చెరువుకట్ట పొడవునా అటు, ఇటు భారీ వాహనాలతో పాటు కార్లు, ఆటోలు తదితర వాహనాలు పదుల సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. చెరువు కట్ట మొదట కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయం వద్ద వంపుగా ఉండటంతో పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించకపోవడంతో అతివేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురైన ఘటనలు కూడా ఉన్నాయి. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువు కట్ట అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారింది. రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల చాటున గంజాయి మత్తులో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయని పలువురు తెలిపారు. పోలీసు పెట్రోలింగ్ నిర్వహించి ఆకతాయిల ఆటలు కట్టించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కట్టకు అటు ఇటుగా 5 ఫీట్ల మేర వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరుగుతుంది. ఈ క్రమంలో వాహనాల పార్కింగ్‌తో రహదారి మరింత కుచించుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. హస్మత్‌పేటకు అల్వాల్ పోలీస్ స్టేషన్ దూరం ఉండటంతో పెట్రోలింగ్ అంతంత మాత్రంగానే ఉంటుంది. దీంతో వాహనాదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తు ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

పోలీసుల పర్యవేక్షణ లేకనే..

పార్కింగ్ విషయంపై అల్వాల్ పోలీసులు దృష్టి సారించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. రోజు రోజుకు వాహనాల పార్కింగ్ సంఖ్య పెరిగి వాటిని అడ్డుగా పెట్టుకుని కొందరు ఆకతాయిలు గంజాయి విక్రయాలకు అడ్డాగా మార్చుకున్నారన్న చర్చ జరుగుతుంది. పోలీసుల పర్యవేక్షణ ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ సంఘాలు పని చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. శనివారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్షేమ సంఘం కార్యాలయాన్ని కార్పొరేటర్ సబిహా బేగం, అధ్యక్షులు బుల్లు శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమేనని, మిగిలిన సమయాల్లో అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తుంగం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు జగన్నాథం, సభ్యులు సత్యనారాయణ, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన మనోజ్‌కుమార్‌కు రూ.3 లక్షలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్ కాలనీకి చెందిన భీమరాజుకు రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సాంబయ్య, ఖాసీం, లియాకాత్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు

మూసాపేట: విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. మూసాపేటలోని పాటీధర్ భవనంలో శనివారం మూసాపేటలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు మాగ్నా కర్త ఫౌండేషన్ సహకారంతో పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాసేందుకు ఇప్పటి నుంచే చదవాలని సూచించారు. కార్యక్రమంలో మాగ్న కర్త ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ విజయ భవాని, డాక్టర్ ఆర్‌కే మూర్తి, నాయకులు రవిగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, అబ్బాస్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు అందించడం అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మదర్సాలో వైద్య పరికరాల సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పేద ప్రజల కోసం ఆసరా మెడికల్ వైద్య పరికరాల బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ రోగులకు అవసరమయ్యే వివిధ వైద్య పరికరాలను ఉచితంగా అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మదర్సాలో వైద్య పరికరాల సెంటర్‌ను కార్పొరేటర్ నర్సింహయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని పేద వారి కోసం వీల్ చైర్స్, బెడ్స్, ఎయిర్ మ్యాటరిస్, వాకింగ్ స్టాండ్, బీపీ మిషన్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారని, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి పరికరాలు అవసరమయ్యే వారు సెంటర్‌కు వచ్చి అడిగితే ఉచితంగా ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసరా సంస్థ చైర్మన్ ఇలియాజ్ షంషీ, వైద్య పరికరాల కో ఆర్డినేటర్ అతేర్ పర్విజ్, నదీమ్ పటేల్, ఖలీల్ పాల్గొన్నారు.

బీపీ నిర్ధారణ పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన బీ.పీ. నిర్ధారణ పరీక్షలకు 40మంది హాజరయ్యారని వైద్యులు పి. వినోద్ తెలిపారు. బీ.పీ. నియంత్రణలో ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న పద్మాకర్

మూసాపేట: మూసాపేటలోని శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం డాక్టర్ రెడ్డి లాబొరేటరీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి భోగి పద్మాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తరువాతే రోడ్లపై డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ, డాక్టర్ రెడ్డీస్ సంస్థ ప్రతినిధి పీఏ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో గృహిణి ఆత్మహత్య

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, గిద్దనపల్లి గ్రామానికి చెందిన కనకరత్నం, సత్తిబాబు దంపతులు కూకట్‌పల్లిలోని సుమిత్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త సెంట్రింగ్ పని, కొడుకు మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం డబ్బులు చెల్లించేది ఉండగా.. ఆ విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుల కోసం పరుగులు

బాలానగర్: కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో శనివారం ఉదయం మీ సేవా కేంద్రాలకు ప్రజలు పరుగులు పెట్టారు. తీరా అక్కడికి వెళ్లి చూస్తే కొత్త రేషన్ కార్డులకు అప్లికేషన్స్‌ని తీసుకోవటం లేదని తెలియటంతో ప్రజలు డీలా పడ్డారు. పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల జాడ లేదు. దరఖాస్తు చేసుకోమని చెప్పి.. ఇప్పుడు కొత్తగా దరఖాస్తులు తీసుకోవడానికి సైట్ ఓపెన్ కావటం లేదని విస్మయం వ్యక్తం చేశారు.

సద్గురు సాయిబాబా ఆలయ వేడుకలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సద్గురు సాయిబాబా ఆలయ 23వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాగడ హారతి, నిత్యారాధన, సాయి దత్త మూలమంత్ర ఆహ్వానం, మధ్యాహ్నం హారతి, విష్ణుసహస్రనామ పారాయణం, సంధ్యాహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వాహణ అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



బాలాజీనగర్‌లో ప్రతిష్ఠించనున్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన హోమాల్లో పాల్గొన్న భక్తులు - కూకట్‌పల్లి

బీజేపీ శ్రేణుల విజయోత్సవ సంబురాలు




బాలాజీనగర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న కార్యకర్తలు


కూకట్‌పల్లి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించటంతో ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అవినీతికి స్థానం లేదన్నది మరోసారి రుజువైందన్నారు. లిక్కర్‌స్కాంతో అక్కడ ఆప్, ఇక్కడ బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. కార్యక్రమంలో భగవంత్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సత్యనారాయణ, అనిల్, కోటేశ్వరరావు, రాము, బాలనారాయణ, సంతోష్, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, అర్జున్, లహరి తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో శనివారం నార్లపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి గొర్రెల సుదర్శన్ ముదిరాజ్, వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు, నాగరాజు గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్, జిత్తు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ మూసాపేట డివిజన్ పాండురంగానగర్ చౌరస్తాలో కార్పొరేటర్ మహేందర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సంబురాల్లో పాల్గొన్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. విజయభవాని, శ్రీనివాస్ చారి, రవి గౌడ్, రమేష్ నాయర్, శోభారాజన్, హేమలత, దర్శనం, పవన్, వాసవి పాల్గొన్నారు.



పాండురంగానగర్‌లో..



అల్లాపూర్ డివిజన్‌లో ..

ప్రమాదకరంగా..





ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాల వద్ద తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గాలులకు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల ముందు వేలాడుతుండడంతో బాటు మరికొన్ని వైర్లు అతుకులతో కూడి ప్రమాదకరంగా మారాయి. ఒక్కో వైరుకు సుమారు 10 చోట్ల అతుకులు ఉన్నాయని, చిన్నపాటి గాలులకే తెగిపడే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో కొన్ని వీధుల్లో చెట్లు పడిపోయి, వైర్లు తెగి స్తంభాలు కూలిన ఘటనలు కూడా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ వైర్లు గాలులకు ఊగకుండా ప్లాస్టిక్ వస్తువులను ఏర్పాటు చేసి మమ అనిపించుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుందని చెప్పారు. పార్కుల ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారులు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వైర్లు సరిచేయాలని, ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





